నమస్తే తెలంగాణ

# ‘మహాలక్ష్మి’ని సద్వినియోగం చేసుకోవాలి



జగిత్యాల అర్బన్: ఆరోగ్య శ్రీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ

- కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా
- ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం చారిత్రాత్మకం
- పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి
- మహాలక్ష్మి, ఆరోగ్య శ్రీ రూ. 10లక్షలకు పెంపు పథకాల ప్రారంభం



కోరుట్ల: కోరుట్లలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఆర్టీసీ డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రమీల

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 9 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషా కోరారు. మహాలక్ష్మి పథకం పేరుతో రాష్ట్రంలోని మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం, ఆరోగ్య శ్రీ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు పథకాలను జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో కలెక్టర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శనివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే అమలు పరుస్తున్న మహాలక్ష్మీ పథకానికి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని చెప్పారు. మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్స్ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఉచితంగా ప్రయాణించవచ్చన్నారు. అదేవిధంగా ఆరోగ్య శ్రీ పరిమితిని రూ. 10 లక్షల వరకు పెంచామన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమల్లో భాగంగా శనివారం మహాలక్ష్మీ, ఆరోగ్య శ్రీ పథకం రూ. 10 లక్షలకు పెంపును లాంఛనంగా ప్రారంభించామన్నారు. మహాలక్ష్మీ పథకాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు గాను జగిత్యాల, కోరుట్ల, మెట్‌పెల్లి డిపోల ఆర్టీసీ బస్సులను సుందరంగా అలంకరించి జగిత్యాల పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుచరిత, డిపో మేనేజర్లు, జిల్లా అధికారులు, మహిళలు, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

రాయికల్, డిసెంబర్ 9 : రాయికల్ పట్టణంలోని అంగడి బజార్‌లో కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మహిళలకు ఉచిత బస్ సౌకర్యం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. మహిళా ప్రయాణికులకు పూలు, స్వీట్లు అందజేసి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మ్యాకల అనురాధ, తాటిపాముల మమత, మాజీ ఎంపీటీసీ ఎద్దండి సింధుజ, కటుకం సులోచన, షర్మిళ, కొయ్యడి సానాజా, లావణ్య, నాయకులు మ్యాకల రమేశ్, ఎద్దండి దివాకర్, కొయ్యడి మహిపాల్, ఎద్దండి భూమారెడ్డి, బాపురపు నర్సయ్య, ఎండీ షాకీర్, సతీశ్ పాల్గొన్నారు.

### కోరుట్లలో ..

కోరుట్ల, డిసెంబర్ 9: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత ప్రయాణ వసతి మహాలక్ష్మి పథకాన్ని కోరుట్ల టీఎస్ ఆర్టీసీ బస్టాండ్‌లో శనివారం డిపో ట్రాఫిక్ ఇన్‌చార్జి ప్రమీల ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, బాలికలు, ట్రాన్స్‌జెండర్లు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సులో రాష్ట్రవ్యాప్తంగా ఉచితంగా ప్రయాణించవచ్చని తెలిపారు. అనంతరం బస్సులోని మహిళలకు ఎలాంటి చార్జీలు లేకుండా జీరో ఫేర్‌తో కూడిన మహాలక్ష్మీ టికెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో డిపో సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ మహేందర్‌రెడ్డి, సెక్యూరిటీ సిబ్బంది ఎస్‌కే రావు, కార్గో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రమేశ్, ఉద్యోగులు పాల్గొన్నారు.

### మహాలక్ష్మి పథకంపై సంబురాలు

పట్టణంలోని కొత్త బస్టాండ్ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరుపుకొన్నారు. అధినేత్రి సోనియా గాంధీ జన్మదినం, కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో భాగంగా మహాలక్ష్మి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి పెంపు పథకాలను అందుబాటులోకి తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. బస్‌లో ప్రయాణిస్తున్న మహిళలకు జీరో ఫేర్ టికెట్లను అందించారు. కార్యక్రమంలో నాయకులు తిరుమల గంగాధర్, కొంతం రాజు, రాజం, పేట భాస్కర్, మచ్చ కవిత, వసీం, షాహీద్ మహ్మద్ షేక్ పాల్గొన్నారు.

### ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం

మెట్‌పల్లి,డిసెంబర్9:ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం మొదలైంది. శనివారం మధ్యాహ్నం మెట్‌పల్లి బస్టాండ్ వద్ద ఈ పథకాన్ని ఆర్టీసీ సిబ్బంది ప్రారంభించారు. కాంగ్రెస్ నాయకులు సోనియా గాంధీ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. మహాలక్ష్మీ పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు కోరారు. ఆర్టీసీ డిపో టీఐ రమేశ్, నాయకులు పూదరి నర్సాగౌడ్, జెట్టి లింగం, ఎర్రోళ్ల హన్మాండ్లు, అందె మారుతి, అంజిరెడ్డి, యామ రాజయ్య, జెట్టి లక్ష్మణ్, రాంప్రసాద్, దుర్గం శేఖర్, లక్ష్మీనారాయణ, బొడ్ల ఆనంద్, వెంకటేశ్ పాల్గొన్నారు.



మెట్‌పల్లి: మెట్‌పల్లి బస్టాండ్ నుంచి బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

## పురుగుల మందు తాగి వృద్ధుడు మృతి

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 9 : తిమ్మాపూర్ గ్రామానికి చెందిన గూడపు నర్సయ్య(60) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్ఐ ఉమాసాగర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం, నర్సయ్య కొంత కాలంగా తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. ఎన్ని దవాఖానలు తిరిగినా కడుపునొప్పి తగ్గకపోవడంతో మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడి కూతురు హేమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

సిరిసిల్ల టౌన్, డిసెంబర్ 9: అధైర్యపడొద్దు.. అన్నివిధాలా అండగా ఉంటామని బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు భరోసానిచ్చారు. సిరిసిల్ల మున్సిపల్ మాజీ కౌన్సిలర్ దార్ల సందీప్ తండ్రి వీరేశం శనివారం మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకులు పరామర్శిం చారు. వీరేశం చిత్రపటం మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సందీప్‌ను పరామర్శించి ఓదార్చారు. ఇక్కడ బీఆర్ఎస్ రాష్ట్ర నేత చీటి నర్సింగరావు, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

## ప్రమాదవశాత్తు పశుగ్రాసం దగ్ధం

కోనరావుపేట, డిసెంబర్ 9: కనగర్తి గ్రామంలో జిల్లెల లక్ష్మారెడ్డికి చెందిన పశుగ్రాసం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. తన వ్యవసాయ క్షేత్రంలో ఇటీవల వరికోతలు పూర్తయిన తర్వాత ఎండు గడ్డి పశువుల కోసమని మిషన్‌తో కట్టలు కట్టించాడు. ఎండు గడ్డి కట్టలను పక్కనే ఉన్న తన భూమిలో నిల్వ ఉంచాడు. ఈ క్రమంలో ₹20వేల విలువైన పశుగ్రాసానికి మంటలు వ్యాప్తి చెందాయి. గ్రామస్తులు వేములవాడ ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించగా, అధికారి కమలాకర్ మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ కోరారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

వేములవాడ రూరల్, డిసెంబర్ 9: గుర్తు తెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన వేములవాడ రూరల్ మండలం అనుపురంలో చోటుచేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రుద్రవరం గ్రామానికి చెందిన పాముల పరశురాములు (55) తన బైక్‌పై వేములవా డకు వెళ్లి తిరిగి వచ్చే క్రమంలో అను పురం వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెం దాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వేములవాడ, డిసెంబర్ 9: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి వాహనాలు నడపాలని వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ దిలీప్, శ్రీ చైతన్య పాఠశాల డైరెక్టర్ శ్రీవిద్య సూచించారు. వేములవాడ పట్టణ సీఐ కరుణాకర్ ఆదేశాల మేరకు శనివారం పట్టణంలోని కోరుట్ల బస్టాండ్‌లో ట్రాఫిక్ నియమావళిపై శ్రీ చైతన్య పాఠశా ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ మాట్లాడుతూ, వాహనదారులు హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని కోరారు. ట్రాఫిక్ గురించి విద్యార్థులు చేపట్టిన నాటక ప్రదర్శన ఆకట్టుకున్నది. ఇక్కడ శ్రీ చైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, ఏజీఎం ముద్రకోల రాజు, డీఎన్‌పీ శేఖర్, ఏవో సుధీర్, పీఈటీ ఉన్నారు.

## ఆంగ్ల బోధనపై శిక్షణ తరగతులు

తెలంగాణ చౌక్, డిసెంబర్ 9: జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఉచితంగా ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యుడు రామేశ్వర్ పేర్కొన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని గీతానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు ఆంగ్ల బోధనపై ఆన్‌లైన్ శిక్షణ తరగతులపై అవగహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ, రాష్ట్ర పరిశోధన విద్యాసంస్థ సహకారంతో విల్ టూ కెన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ సంస్థ ఆధ్వర్యంలో 40రోజుల పాటు ఉచిత ఆన్‌లైన్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఉపాధ్యాయుడు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 21 జిల్లాలో ఈ శిక్షణ తరగతులు పూర్తయినట్లు వివరించారు. డీఎస్‌వో దేవయ్య ఉన్నారు.

## గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఆహ్వానం

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 9: తంగళ్లపల్లిలోని తెలంగాణ గిరిజన సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్ రజినీ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కళాశాలలో ఇంగ్లిష్ లెక్చరర్ పోస్టుకు ఈ నెల 14న వాక్ ఇన్ ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, సంబంధిత పీజీ సబ్జెక్టులో 55శాతం ఉత్తీర్ణతతోపాటు నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హత గల మహిళా అభ్యర్థులు ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

## తంగళ్లపల్లిలో కార్తీక వనభోజనాలు

సిరిసిల్ల రూరల్, డిసెంబర్ 9: తంగళ్లపల్లిలోని రామాలయ మిత్ర కమిటీ ఆధ్వర్యంలో గాయత్రీ ఆశ్రమంలో కార్తీక దామోదర కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేసి అక్కడే వనభోజనాలు చేశారు. కమిటీ అధ్యక్షుడు తిరుపతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రాజన్న తదితరులున్నారు.

## కమ్ముకున్న పొగమంచు: ఇబ్బందుల్లో వాహనదారులు

పెగడపల్లి, డిసెంబర్ 9: మండలంలో శనివారం తెల్లవారు జామున పొగమంచు కమ్ముకుంది. దీంతో వాహన దారులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తుఫాన్ తీవ్రత వల్ల ఉదయం 7 గంటల వరకు పొగ మంచు ప్రభావం ఉండడంతో వాహపదారులు లైట్లు వేసుకుని ప్రయాణం చేశారు. పొగ మంచు ప్రభావం ఎక్కువగా ఉన్నందున ఉదయం వేళల్లో వాహనదారులు తమ వాహనాల హెడ్ లైట్లు వేసుకుని నెమ్మదిగా, జాగ్రత్తగా వెళ్లాలని జిల్లా రవాణాశాఖాధికారి వంశీ, పెగడపల్లి ఎస్సై సతీశ్ సూచించారు.



పెగడపల్లి-కరీంనగర్ ప్రధాన రహదారిపై కమ్ముకున్న పొగమంచు

# నర్సన్న సన్నిధిలో భక్తుల రద్దీ



నర్సింహస్వామి దర్శనం కోసం క్యూలో నిల్చున్న భక్తులు

ధర్మపురి, డిసెంబర్ 9: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలోభక్తుల రద్దీ ఎక్కువైంది. కార్తీక మాసం రెండో శనివారం సెలవు దినం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి క్షేత్రానికి తరలివచ్చిన భక్తులు మొదట గోదావరి నదిలో స్నానాలాచరించి సంకల్పాది పూజలు నిర్వహించి, నదిలో కార్తీక దీపాలు వదిలారు. అనంతరం ప్రధాన దేవాలయమైన లక్ష్మీనరసింహస్వామివారితో పాటు అనుబంధ ఆలయాల్లో స్వామివార్లను దర్శించుకున్నారు. స్వామివారికి పట్టెనామాలు, కోరమీసాలు, ఒడి బియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలోని ఉసిరి చెట్టు వద్ద దీపాలు వెలిగించి, బ్రాహ్మణులకు దీపదానాలు చేశారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.



గోదావరిలో స్నానాలాచరిస్తున్న భక్తులు